# రాజనీతి

ధవళేశ్వరం అనకట్టనుంచి కాకినాడకు పోయే కాలవకు వో గట్టు సిమెంటు రోడ్డు, మరో గట్టు మట్టిబాట. సిమెంటు రోడ్డుకి మరోపక్క రైలుకట్ట నానుకొని, సిమెంటు రోడ్డుకి కాస్త ఎడంగా చిన్న రైల్వే స్టేషను. స్టేషనుకి ఎదురుగా సిమెంటు రోడ్డును చేరి చిన్న కాఫీహోటలు పాక. పాకకి స్టేషనుకి మధ్యనున్న కాళీస్థలాన్ని గుబురుగా విశాలంగా పెరిగిన చింతచెట్టు ఆవరించి వుంది. ఆ చింతచెట్టు నీడలో త్వరగా చీకటి పడుతుంది. ఎండవేళ ఎందరినో ఆ చెట్టు నీడ వెయిటింగ్ రూమ్‌లా ఆదుకుంటుంది. ఎప్పుడూ ఆ నీడలో నలుగురైదుగురు కంటె వుండరు. చిన్న స్టేషనేమో, అంతకంటె ఆ స్టేషనుకి రద్దీ వుండదు. ఆ చెట్టు నీడన కూర్చున్నవాళ్ళు, కాఫీ హోటలు పాకలో కూర్చున్నవాళ్ళు – రోడ్డున పోయే బస్సుల్ని, చిన్నకారుల్ని, కాలవలో నిశ్శబ్దంగా ఎదురూవాలూ యీదే పడవల్ని, పడవలపైన వళ్ళువిరుచుకుని నిలిచిన తెల్లని తెరచాపల్ని చూస్తూ కాలం గడిపేస్తారు.

కారుల చప్పుడు, కాలవనీటి ప్రవాహపు సంగీతం, రైళ్ళు అప్పుడప్పుడు వేసే గావు కేకలు, ఎడ్లబండిని తోలే బండివాడు ఎడ్లను అదలించే అదలింపులు – చింతచెట్టుమీద అప్పుడప్పుడు వచ్చి వాలే పిట్టల కిలకిలలు – ఇంతకంటె సందడి అక్కడెప్పుడూ అగ తగలదు.

కాని ఆ రోజున స్టేషను ముందు గందరగోళంగా వుంది. మసక చీకట్లో చింత నీడన పెళ్ళింత హడావుడిగా వుంది.

సాయంత్రం తూర్పు నుంచి వచ్చే పాసింజరు బండిలో తూర్పు జనం దిగారు. జనం అంటే పదీ యిరవై మందికాదు. దాదాపు రెండువందల మంది. ఆడా మొగ, పిల్లా ముసలి అంతా ఆ చెట్టుకింద బసచేసారు. వో ఊరు వెలసినట్లుందక్కడ. కొత్తరకం యాసతో వాళ్ళాడే మాటలు, పిల్లల ఏడుపులు – ఆడాళ్ళ కేకలు – ముసలాళ్ళ మాటా మంతీ – అంతా చూస్తే వాళ్ళక్కడ ఎన్నాళ్ళ క్రితమో స్థిరపడిపోయినట్లనిపిస్తుంది.

'గుంటడ్ని గోడ్డు కొగ్గేసి సూత్తా నిల్సుండి పోనావేటి?' అని కసిరింది పోలు పిల్లి, రోడ్డుపక్కనే నిలబడి కాలవ ప్రవాహాన్ని చూస్తోన్న సింహాచలాన్ని.

'ఎందుకేటేస్ గొంతు సించుకుంతున్నావ్? నాకు కళ్ళునేవా? నేను సూత్తంనేదా? ఎడబోతాడేటాడు?'

'రోసం కుంచిడు ఆలోసన సిటికెడు. యేమోటరో గుంటడికి తాకినాక నెత్తిబాదుకుంటా కూకుంటె అప్పుడు బాగుంటది' అంది చిరాగ్గా పోలుపిల్లి.

కమ్ముకున్న చిక్కని చీకట్లో ఎర్రని మంటలు పొయ్యిలకింద మండుతున్నాయి.

ఆ మంటల వెలుగులో పొయ్యిదగ్గర కూర్చున్న ఆడవాళ్ళ ముక్కులకి చెవులకి వున్న రంగుమాసిన నగలు మెరుస్తున్నాయి. నూనెకి ముఖంవాచిన వాళ్ళజుట్లు పిచిక గూళ్ళలా వున్నాయి. వాళ్ళ నల్లని కాయిదేరిన శరీరాలు – ఆ యెర్రని వెలుగులో నూని పులిమిన నల్లరాళ్ళలా వున్నాయి. అలా వాళ్ళంతా వంటలు చేసుకుంటున్నారు. ఆ చుట్టు పక్కలున్న ఎండుగడ్డిని, పుల్ల ముక్కల్ని యేరి పొయిల్లోకి తోస్తున్నారు. వుండుండి మంటలు గుప్పున రేగుతున్నాయి. దూరానికి ఆ మంటలు దీపాల్లా కనబడుతున్నాయి.

మగాళ్ళు స్టేషను కెదురుగావున్న రేవులో దిగి స్నానాలు చేస్తున్నారు. నిద్దరకొచ్చిన పిల్లలు యీతాకు చాపలమీద నిద్రపోతున్నారు. ఆకలితో నిద్రపట్టని పిల్లలు కడుపుబ్బేలా ఏడుస్తున్నారు. తల్లులు చిరాకుపడుతున్నారు.

ముఠా పెద్ద అప్పన్న కాఫీ హోటలు పక్కనేవున్న కిళ్ళీబడ్డీవార ముడిచి పెట్టుకుని కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాడు. మధ్య మధ్య మడం పొగేస్తున్నాడు. (చుట్టని నిప్పువున్న వైపు లోపలికి పెట్టి పొగని బయటికి వూదడం.)

కాఫీ హోటల్ పాక యజమాని, నరసింహం ఇంక బేరాలొచ్చేలా లేవనుకుని, సామాను సర్దేస్తున్నాడు.

కాలవలో స్నానం చేసొచ్చిన కొండయ్య, పైజామా చొక్కా తొడుక్కుని తలని వేళ్ళతో సవరించుకుంటూ అప్పన్న దగ్గిరికొచ్చి కూర్చున్నాడు. అప్పన్న చుట్టని పళ్ళమధ్య నొక్కి 'మనం ఎల్లుండే కాపులు మనకాడ కెందుకొత్తార్రేట్రా? నీదంతా చాదత్తంగానీ' అన్నాడు.

'మనం వచ్చి నాలుగు గంటలుకూడ కాలేదు. అప్పుడే నువ్వు కంగారుపడితే ఎలా తాతా?' అన్నాడు కొండయ్య.

'పనిచేసుకుని వో పావల డబ్బులట్టుకు పోతానికొచ్చినోళ్ళం మనం. ఆ కాపులు మనకాడకి నాకపోతే మన కరుసులన్నీ బొక్కేనా? మరిగంటే....మనం ఆ కాపుల్తో పోటీపడి నెగ్గేదుత్తాంవేట్రా? నీ యెర్రిగాని?'

'నామీద పెత్తనం పెట్టావు. నే చెప్పినట్లు నడవండి మీరంతా, యేటా కంటె ఎక్కువ సంపాదించుకుని, మన కష్టానికి తగిన ఫలితం పుచ్చుకుని మరీ వెడతాం యిళ్ళకి.'

'సరే, కానీయ్, సదువుకున్నోడవ్ నువ్వు. నీ మాటెందుక్కాదనాలా?'

'నువ్వామాట మీదుండు తాతా. అంతేచాలు' అన్నాడు కొండయ్య హుషారుగా.

'కూళ్ళు తింటాకి నెగండిక. సానాపొద్దోనాది' అని పిలిచింది ముత్తాలమ్మ.

అంతా, వాళ్ళు తెచ్చుకున్న అల్యూమినియం గిన్నెల్లో, అన్నాలు పెట్టుకుని తృప్తిగాతిని, గిన్నెడు గిన్నెడు ఉడుకుగంజి తాగారు. కొందరు గడ్డి పరుచుకుని, కొందరు యీతాకు చాపలు పరుచుకుని నడుములు వాల్చారు.

కొండయ్యకి మాత్రం నిద్ర పట్టలేదు. మూసేసిన కిళ్ళీబడ్డీ అంచు మీద కూర్చున్నాడు. కొండయ్య అక్కడికొచ్చిన ముఠాజనంలో చాలా మందికంటె చిన్నవాడు. కాని వాళ్ళందరికంటె కాస్త చదువుకున్నవాడు. మాటకారి, తెలివైనవాడని

పేరు సంపాదించుకున్నాడు వాళ్ళ జనంలో. కొండయ్య వట్టి చదువుకున్నవాడు మాత్రమే కాదు, చదువుతోబాటు ఆలోచించడం కూడ నేర్చుకున్నాడతను.

అతనికి ఆలోచించడం నేర్పింది రమణయ్య మేస్టారు. ఆయన చదువుకంటే ఆలోచించడం ఎక్కువ నేర్పారు కొండయ్యకి. కొండయ్యకి ఆ క్షణంలో రమణయ్య మేస్టారు గుర్తుకొచ్చారు. ఆయన అనే మాటలు జ్ఞాపకమొచ్చాయి –

'ప్రకృతి సంపద అందరిసొత్తూ, దాన్ని కొందరు సొంతం చేసుకుని బలవంతులై, బలహీనుల్ని దోచుకుంటున్నారు. అది ఆపడానికి బలహీనులు బలాన్ని పుంజుకుని, తిరగబడి, ఆ సంపదల్ని యిన్నాళ్ళబట్టీ పీడితులుగా బతుకుతున్న జనానికి పంచియివ్వాలి. అలా చాలా దేశాలలో జరిగింది. అలాంటి దేశాలు బాగున్నాయిప్పుడు' అంటూ ఏవేవో కొత్త కొత్త విషయాలు చెపుతూండేవాడు రమణయ్య మేస్టారు.

కాని కొన్నాళ్ళకి రమణయ్య మేస్టారు జనం మధ్య, స్కూల్లోను కనుపించడం మానేశారు. అడవుల్లోను కొండలలోను తిరుగుతున్నారని చెప్పకుంటున్నారు జనం.

'యిప్పుడు రమణయ్య మేస్టారు తల యిరవైవేల రూపాయల ఖరీదని వార్తాపత్రికలు ప్రకటించాయి. అంత తెలివైన తలకి ఆమాత్రం కిమ్మత్తు లేకపోతే ఎలా?' అనుకున్నాడు కొండయ్య.

'రమణయ్య మేస్టారు ఎక్కడ ఎలావున్నా, నా గుండెలలో ఎప్పుడూ వుంటాడు' అనుకున్నాడు కొండయ్య.

ఇంతలో రోడ్డు వెంట ఎవరో యిద్దరు మాట్లాడుకుంటూ నడుస్తున్నారు.

వాళ్ళలో ఒకడు, స్టేషనుముందు చింతచెట్టుకింద చీకట్లో మోడుల్లా పడువ్న జనాన్ని చూసి, 'కోతల జనం వచ్చినట్టున్నార్రోయ్. యీసారి యేటాకంటె పదిరోజు లాలశ్యంగా వచ్చారీళ్ళు, గింజ రాలిపోతుందని పెద్దకాపులు నాల్రోజులు బట్టి గుంపుచింపు లడిపోతున్నారు' అన్నాడు పక్కవాడితో.

'వచ్చినోళ్ళు ఎకాఎకిని ఊళ్ళో కెళ్ళక, టేసనుకాడ మకావేసారేటి కత?' అన్నాడు రెండో ఆసామీ.

'రైలు దిగేటప్పటికి సందలడిపోనాదేమో.'

'ఊళ్ళొత్తే మనకూలి డౌనైపోద్దెహె. రేపటినుంచి మనకింక నాలుగు రూపాయల రేటుండదు. మూడో మూడున్నరో అయిపోద్ది'.

'ఆ మాటా నిజమే మరి. మందెక్కువయితే మజ్జిగ పల్చబడతాది మరి.'

'అట్టా అంటావుకాని, యీ పనిరద్దీ రోజులలో కూలోడెక్కడ దొరుకుతున్నాడ్రా? యీతల వరిసేల కోతలు. ఆతల సెరుకు సుట్టుడు.'

అలా మాట్లాడుకుంటూ వాళ్ళు కొండయ్య ముందునుంచి రోడ్డునే నడిచిపోయారు.

'అయితే యిప్పుడిక్కడ కూలి రోజుకి నాలుగు రూపాయలన్నమాట' అనుకున్నాడు కొండయ్య.

'ఏమైనా యీసారి నాలుగు రూపాయలకంటె యెక్కువ కూలే పుచ్చుకోవాలి పెద్దకాపుల దగ్గరనుంచి' అని నిశ్చయించుకున్నాడు కొండయ్య.

బడ్డీ దిగి, వాళ్ల జనంతోబాటు వో ఈతాకు చాప పరుచుకుని, నడుం వాల్చాడు. నల్లని ఆకాశం మీద నక్షత్రాలు పేదవాడి ఆశల్లా మిణుకు మిణుకుమని మెరుస్తున్నాయి. కొండయ్య పక్కనే వాళ్ళ ముఠా పెద్ద అప్పన్న ఆదమరిచి నిద్రపోతున్నాడు.

అప్పన్నని చూసేసరికి అతను గూడెంలో అంటూండే మాటలు గుర్తుకొచ్చాయి కొండయ్యకి –

'ఆనకట్ట కట్టేటప్పుడు మనోళ్ళంతా ఆడకెళ్ళి పనిసేసారంట. ఆడున్న జనం సాలక దొరోళ్లు మన జనాన్ని కూడ పిలిసి పని పూరితి సేయించుకున్నారంట. కాని ఫలితం అళ్ళకి. కట్టం మన జనానికి మిగిలిపోనాది. ఆ పని జరుగుతావున్న రోజులలో ఆడనుంచి నీరు మనకాడ దాకా వత్తాదని సెప్పేవోరంట దొరోళ్ళు. కాని రానేదు. ఆనకట్ట పూరితయినకాడనుంచి ఆడున్న జనానికి బంగారం పండుతున్నదనుకో' అంటూండేవాడు అప్పన్న.

'కష్టపడి పనిచేసింది ఎక్కడ జనమో? కాని అనుభవిస్తోన్నదీ, బాగుపడింది ఏ కొద్దిమందో? ఎక్కడవాళ్ళో, వందలమంది రక్తం కొద్ది మందికి పన్నీరు. ఆలోచిస్తే అంతా గుండె మంటగానే వుంటుంది – రమణయ్య మాస్టారు చెప్పినట్టు' అనుకున్నాడు కొండయ్య.

తెల్లవారింది. స్టేషనుముందు మళ్ళా కలకలం ప్రారంభమయింది. రోడ్డున నడుస్తోన్న రైతాంగానికి ముఖాలు విడ్డాయి. రెండుబారల పొద్దెక్కినా ఆ జనం అక్కడే వున్నారు. మళ్ళీ మధ్యాహ్నం వంటకి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కాలవ అవతలవున్న రైతాంగానికి ముఠాజనం వచ్చినట్టు వుప్పందింది. కామందుల ముఖాలు చాటంతయ్యాయి. అప్పటిదాకా, పండిన పంటంతా రాలిపోతోందని, దీపావళికి ముసురడితే పంటంతా తడిసిపాడైపోతుందని, ఏటా యీపాటికి వచ్చే ముఠాజనం యింకా ఎందుకురాలేదా అని, పెద్ద రైతులంతా తల్లడిల్లిపోతున్నారు.

ఊళ్ళో కూలీల ఎద్దడి మరీ ఎక్కువగా వుంది. చెరుకు చుట్టు, కోతలు వొకేసారి వస్తాయి యేటా. తూర్పు నుంచి ముఠావాళ్ళు వస్తే తప్ప .కోతలు లొంగవు.

పొద్దు పడమటికి తిరుగుముఖం పట్టినా, ముఠాజనం వూళ్ళోకి రాకపోవడంతో – సావరం పెత్తందారు నరసయ్య, పాలెం పెత్తందారు సూరన్న, గండిపాడు పెత్తందారు నారాయుడు ఎవళ్ళంతటవాళ్ళు స్టేషనుకి బయలుదేరారు. నరసయ్య, సూరన్న, నారాయుడు కాలవదాటుతూ బల్లకట్టుమీద కలుసుకున్నారు.

మూడు వూళ్ళూ పక్కపక్కనే. ముగ్గురు పెత్తందార్లూ ఆ ముఠా జనం కోసమే. ముగ్గురూ మూడేసివందల యకరాల వూడుపుచేలున్నవాళ్ళే.

స్టేషను దగ్గర కెళ్ళారు ముగ్గురు పెత్తందార్లూ.

'యేరా అప్పన్నా! ఉేసనుకాడ యిడిది దిగారేటి పెళ్లోరులాగ? ఊళ్ళోకి రాదలుసుకోలేదేట్రా?' అన్నాడు గండిపాడు పెత్తందారు నారాయుడు.

'బొట్టెట్టి పిలుసుకెల్లాలేమో మనవ్?' అన్నాడు పాలెం పెత్తందారు సూరన్న నవ్వుతూ.

'అబ్బే! అదేం కాదండీ...?' అని అప్పన్న ఏదో చెప్పబోతూ వుండగా కొండయ్య మాట కడ్డొచ్చి, "ఎవరికి కూలీలు అవుసరముంటే వాళ్ళే యిక్కడ్నించి పిలుచుకెడతారు గదా అని యిక్కడే ఆగిపోయామండి" అన్నాడు.

"ఈడెవడ్రా అప్పన్నా?" అన్నాడు సావరం పెత్తందారు నరసయ్య కొండయ్యని చూస్తూ, చుట్టని పళ్ళమధ్య నొక్కిపట్టి.

'నా మనవడండీ?'

"అసలీడు మీవోడులా లేడేట్రా? ఈడి వూసులు, వాలకం సూత్తూంటే మాసైడోడులా వున్నాడు" అన్నాడు నరసయ్య అప్పన్నతో.

కొండయ్యకి వళ్ళు మండుతోంది. అప్పన్నకి పదెకరాల కొంద్రుంది గూడెంలో. అక్కడ అతన్ని అంతా గౌరవిస్తారు. యిక్కడికి కూలికి రావడంతో – 'వాడు–వీడు' అని సంబోధిస్తున్నారు వీళ్ళు.

"కష్టపడి పనిసేవాడ్ని చూస్తే, పని చెయ్యనివాడికి యెందుకో యింత చులకన?" అనిపించింది కొండయ్యకి.

"ఊఁ లెగండి లెగండి బేగిపోదాం. పొద్దారిపోతందప్పుడే బేగి మొదలెడితే పదిసెక్కలేనా కోతలొంగుద్ది" అని తొందర చేసాడు నారాయుడు.

"లెగండి లెగండ్రా కుండామండా సరుదుకోండి" అంటూ వంతపాడాడు నరసయ్య.

"వెళ్ళేముందు రోజుకూలి ఎంతో మాట్లాడుకుని వెళ్ళడం మంచిదండి" అన్నాడు కొండయ్య ఎంతో నిబ్బరంగా.

నరసయ్య కళ్ళెర్రచేసి కొండయ్యని చూస్తూ "యవడ్రా అప్పన్నా యీడు" అన్నాడు. నాతో బేరమాడేవాడా అన్న చులకన భావాన్ని వ్యక్తంచేస్తూ.

"నా మనవడేనండి. యిన్నాల్లు బత్తీలో సదువుకుంతన్నాడండి" అన్నాడు అన్నెం పున్నెం ఎరగని అప్పన్న మనవడ్ని చూసి మురిసిపోతూ.

"తెలుత్తానేవుంది వోలకం" అన్నాడు నారాయుడు వెటకారంగా.

"నీ కెందుకురా ఈ గొడవలన్నీ? పెద్దోడు అప్పన్నెరగడేటి, ఏటా వత్తన్నావోడు?" అన్నాడు సూరన్న.

"ఈ సాలునుంచి ముటా పెత్తనవంతా ఆడిదేనండి, ఆడిమాట మీద నడుసుకోవలసి నోళ్ళవేనండి మేవంతా" అన్నాడు అప్పన్న.

"అదా సంగతి! అల్లాసెప్పు" అన్నాడు సూరన్న.

"కూలిదేవుందరా! మామోలే. యేటాలాగే మొగోడికి మూడు రూపాయలు, అడదానికి రెండున్నర" అన్నాడు నారాయుడు మీసాలు సవరించుకుంటూ.

"ఆ లెక్కని రాలేవండి" అన్నాడు కొండయ్య కుండ బద్దలు కొట్టినట్టు.

"ఏ లెక్కనైతే వత్తారేటి?"

"ఆడా మొగా తేడాలేకుండా, యిద్దరికీ సమానంగా, మనిషికి నాలుగు రూపాయిల్లెక్కని యివ్వండి."

"యేంట్రోయ్! మమ్మల్ని దోసుకెళ్ళి అడ మేడలు కడదామనేటి" అన్నాడు నారాయుడు పుల్ల విరిచినట్లు.

"అలా ఎందుకనుకుంటారు! మేం పడిన కష్టానికి మీరిచ్చే సబబైన కూలని ఎందుకనకూడదు?"

"ఊళ్ళోనే అంత రేటులేదు."

"ఊళ్ళో ఎంత రేటుందంటారు?"

"గాడిద గుడ్డంత. నీకెందుకేటెహ మావూరి గొడవలు? నువ్వన్న రేటేనా? యింకేవన్నా దిగుతావా?"

"దిగితే మాక్కిట్టదండి."

"కిట్టక పీ కట్టుకుంటాదా?"

"ఎక్కువిస్తే మీ పీకట్టుకుంటుందా?" అందా మన్నంత కోపం వచ్చింది కొండయ్యకి, కాని నిలదొక్కుకున్నాడు.

"అసలు ఈ రేటు నీరేటా? యింకెక్కడేనా వుందా?" అన్నాడు నరసయ్య మధ్యలో కలిపించుకుంటూ.

"యిక్కడిప్పుడున్న రేటు మనిషికి నాలుగేకదండి. దూరంనుంచి వచ్చినా, అదేరేటు మాకూ యిమ్మని అడుగుతున్నాను."

"అన్నీ వాకబుసేత్తాకే యిక్కడ మకావేసారన్నమాట. పాత కూలికి వత్తారో, రారో తేల్సి సెప్పేయండ్రా" అన్నాడు నారాయుడు చివరిమాటగా.

"అంతకి తక్కువైతే మాక్కిట్టదండి" అన్నాడు కొండయ్య మరోమాట లేదన్నట్లు.

"సరే అయితేను. అంత కూలివ్వటానికి మాకూ కుదరదు. నడండో పోదాం. దీపాలామాసకి కాకపోతే కారితీక పున్నానికాతియ్ కోతలు, అట్టే వుండిపోవులే. పదండి పోదాం" అంటూ నోట్లో నానివున్న చుట్టని నేలకేసి కసిగా కొట్టి, నారాయుడు దారితీసాడు. అతని వెనకే, నరసయ్య సూరన్న - కొండయ్యని కసిగా చూసి అనుసరించారు.

కాలవదాటగానే నారాయుడు వూరు తగుల్తుంది. నారాయుడు ఇంట్లో ముగ్గురు కామందులు మంతనాలు మొదలెట్టారు. నారాయుడు తారాజువ్వలా లేచిపోతున్నాడు.

"కూలిపని కొచ్చిన వెదవలు కూలోళ్ళలాగుండాలి. మనతో కూలిబేర మాడతారా! ఆ కుర్ర వెదవ నా ఆరిపోయిన సుట్టంతలేదు - నాకే ఎదురు సమాధానం సెబుతున్నాడు. అసలక్కడె మక్కిలిరగతందావనుకున్నాను. టంకురోడ్డయిపోయింది" అని ఎగిరిపడుతున్నాడు నారాయుడు అరుగుమీద కూర్చుని.

అతనికి అటూ ఇటూ సూరన్న, నరసయ్య కూర్చుని, "యిప్పుడెలా గంటావయ్యా? అవతల పంటంతా రాలిపోతుందాయె" అన్నారు.

"పోతే పోనియ్యండో, యీయేటికి పండలేదనుకుంటాం. గాదిలో వున్న గింజలు యింకా అయిదేళ్ళదాకా సరిపోతాయ్ మనకి. మరేం దండుగలేదు" అన్నాడు నారాయుడు.

"అదేంమాట నాన్నా? కూలీ జనంతో వచ్చిన మాట పట్టింపుకోసం పండిన

పంటంతా పాడు చేసుకుంటామా? ఏదో దారి ఆలోచించి పని జరుపుకోవాలిగాని..." అన్నాడు నారాయుడు కొడుకు కృష్ణమూర్తి లోపల్నించి వచ్చి.

"బాగా సదువుకున్నోడివి. నువ్వే యేదో ఉపాయం ఆలోచించు అల్లుడూ" అన్నాడు సూరన్న.

"అసలు వాళ్ళేమన్నారు?"

"ఆడా మగా తేడాలేకుండా అందరికీ నాలుగు రూపాయిల రేటుని యిమ్మన్నారు. ఎవడో కుర్రోడిది పెత్తనవంట ఈయేడు - జానడులేడాడు" అన్నాడు సూరన్న.

"మనకవసరమున్నప్పుడు తప్పుతుందామరి. మనకి అవుసరం వుంది కనుక అడిగింది యిచ్చి పని చేయించుకోవాలి మరి" అన్నాడు కృష్ణమూర్తి.

"నాకవసరం లేదు. నా సేను యీయేడు కోయించను" అన్నాడు నారాయుడు మొండిగా.

"అదేవన్న మాటయ్యా? నాలుగైదెకరాలున్నోళ్ళంతా పంటొబ్బిడి సేసుకుని, ఇంట్లో పోసుకుని ముప్పితంగ కూకున్నారు. రెండేసొందలు, మూడేసొందలు యకరాలున్నోళ్ళం మనం. మన యనకాలే నడుద్దామని కూకున్నారు యాభై అరవై యకరాలున్నోళ్ళు! మన కుర్రోళ్ళు బట్ట నలగ నివ్వరు - మనం నడుం వంచలేం. నువ్వు కోత్తావా? నేకోత్తానా? - సూడల్లుడూ! నువ్వే ఏదో దారి సూడాలయ్య" అన్నాడు సూరన్న అటు నారాయుడుని సముదాయిస్తూ, ఇటు కృష్ణమూర్తిని దువ్వుతూ.

"నేనెళ్ళి మాటాడి తీసుకొస్తానుండండి మావా" అంటూ బయలుదేరాడు కృష్ణమూర్తి.

"ఈడూ అళ్ళకే సపోరుటు. నిన్ను సదివించి పాడుసేసాన్రా, అయితే అళ్ళ కాళ్ళకాడ కెల్లి అళ్ళని బతివలాడి తీసుకొత్తావన్నమాట" అన్నాడు నారాయుడు కోపంగా.

'కూలి పుచ్చుకునేటప్పుడు వాళ్ళంతా మన కాళ్ళ దగ్గరికి రారేమిటి నాన్న. నీదంతా చాదస్తంగాని' అన్నాడు కృష్ణమూర్తి.

'మాబాగా సెప్పావయ్యా అల్లుడు' అని కృష్ణమూర్తిని బలపరచాడు సూరన్న.

కృష్ణమూర్తి స్టేషను దగ్గర కొచ్చాడు, పెద్దలు మాట్లాడిన మాటల్నిబట్టి సులువుగానే గుర్తుపట్టాడు కొండయ్యని కృష్ణమూర్తి.

'ఈ ముఠా పెద్దవి నువ్వేనా?' అన్నాడు కృష్ణమూర్తి.

'ఔనండి' అన్నాడు కొండయ్య.

'ఎంతవరకు చదువుకున్నావ్?'

'పెద్దగా చదువుకోలేదండి.'

'మరి మీరు ఇంకా పనికెళ్ళలేదేం?'

'మేమడిగిన కూలి యివ్వడానికి రైతులు యిష్టబడలేదండి.'

'ఎంతడిగావ్?'

'నాలుగు.'

'అవును మరి, ధరలు మండిపోతున్నాయి. రోజు గడవడమే కష్టంగా వుంది. ఆ మాత్రం కూలి లేకపోతే యెలా బ్రతుకుతారు పాపం?'

'చదువుకున్నవారు కాబట్టి మా కోరికలో వున్న న్యాయాన్ని గ్రహించారు.'

"ముసలాళ్ళకి కాలంలో వచ్చిన మార్పులు అర్థంకావు. వాళ్ళవన్నీ పాత ఆలోచనలు, పాత ధోరణీను, నువ్వడిగిన కూలీ సబబుగానే వుంది మా చేను కోద్దురుగాని బయలుదేరండి" అన్నాడు కృష్ణమూర్తి.

కొండయ్యకి కృష్ణమూర్తి మాటలు ఎంతో సంతోషాన్ని కలిగించాయి. అప్పన్నతో వో మాటచెప్పి ముఠాని సామానులు సర్దుకోమని చెప్పాడు.

'త్వరగా బయలుదేరమను మీవాళ్ళని' అన్నాడు కృష్ణమూర్తి.

"ఒక చిన్న మనవండి."

"ఏమిటి?"

"పిల్లాజల్లతో వచ్చాం. అరుగులమీద, చూరులవార వుంటున్నారు యేటా మావాళ్ళు. అసలే వర్షాకాలం. పిల్లలకి జ్వరాలు అవీ వస్తాయి. కాస్త మావాళ్ళు వుండడానికి సావిడిలాంటి దిప్పిస్తే..." అన్నాడు కొండయ్య ఎంతో వినయంగా.

"అల్లాగే, దానిదేవుంది? నీ కభ్యంతరం లేకపోతే నువ్వు నా గదిలోనే వుండొచ్చు."

"అబ్బే! అవసరం లేదండి. మావాళ్ళతోటే వుంటాను" అని ముఠాని బయలుదేరదీశాడు కొండయ్య. కృష్ణమూర్తి మంచితనానికి, ఔదార్యానికి కొండయ్య మనసు మురిసిపోయింది.

☆ ☆ ☆

కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. నారాయుడు, నరసయ్య, సూరన్నల వూళ్ళన్నీ దగ్గరదగ్గరగానే వుంటాయి. మూడు గ్రామాలలోని చేలు కోసి సాయంత్రానికి నారాయుడు వూరికి ముఠాఅంతా తిరిగి వచ్చేసేది. ఈసారి వాళ్ళంతా వుండడానికి మంచి మకాం చూపించాడు కృష్ణమూర్తి. చూరులవారా, అరుగులమీద ఎవ్వరూ లేరు ఈసారి. ధాన్యం కొట్లు సావిళ్ళలోను, పాకల్లోను, వసారాల్లోను! శుభ్రం చేయించిన గొడ్ల శాలల్లోను ముఠావాళ్ళు వెచ్చగా పడుకుని, పగలంతా వెచ్చగా పనిచేస్తున్నారు.

పొద్దున్నే ఆ జనం పనిలోకి వెళ్ళేటప్పుడు, సాయంత్రం తిరిగి వచ్చాక వంటలు చేసుకునేటప్పుడు వూరంతా గందరగోళంగా వుండేది. వాళ్ళ యాసమాటలు – వాళ్ళ గొడవ అంతా వూరును సందడిగా వుంచిందా పది పదిహేను రోజులు.

ఆ పదిహేను రోజులూ ఏటాలాగే చెంచయ్య కిరాణా దుకాణంలోను, గురుమూర్తి కిరాణా దుకాణంలోను ముఠావాళ్ళు కావలసిన సామాగ్రిని ఏరోజుకారోజు కొనుక్కునేవారు. మొదటిరోజున పప్పు, బియ్యం, మిరపకాయలు, చింతపండు – ఉప్పు మొదలైన సామాగ్రి తెచ్చుకొందుకు వెళ్ళినపుడు ధర లడిగారు కొట్టుదగ్గరకెళ్ళిన ఆడాళ్లు.

"మీకు రేటెక్కువెత్తానేటి? ఏటా రేటే - మామూలు రేటే. కావలసిందట్టుకెళ్ళండి" అన్నారు యిద్దరు దుకాణదారులు.

అమాటమీదే వాళ్ళు ఊళ్ళో వున్నన్నాళ్ళు కావలసిన కిరాణా సామగ్రినంతా యేరోజుకారోజు ఆ దుకాణాలలో కొనుక్కుని వంటలు చేసుకుతిని, పని హుషారుగా పూర్తిచేశారు ముఠాజనం.

అంతక్రితంరోజు పని పూర్తయిపోయింది. ఆ రోజున వాళ్ళంతా సామాను సర్దుకొని తూర్పుకి వెళ్ళిపోడానికి ప్రయాణమౌతున్నారు.

ఏటా జరుగుతున్న రివాజు ప్రకారం రైతులు ముఠావాళ్ళకి ఇవ్వవలసిన మొత్తం లెక్కలు తేల్చుకునే సమయానికి యిద్దరు దుకాణదారులు - గురుమూర్తి, చెంచయ్య వచ్చారు వాళ్ళ పద్దు పుస్తకాలు పట్టుకొని.

ముఠావాళ్ళకి రావలసిన కూలి ఎంతో కృష్ణమూర్తి లెక్కచెప్పాడు కొండయ్యకి. కొండయ్యకి లెక్క సరిగ్గావున్నట్టే అనిపించింది. కృష్ణమూర్తి మంచితనాన్ని, ఆదరణని లోలోపల మెచ్చుకున్నాడు కొండయ్య.

"ఈయేడు ముఠావాళ్ళ వాడకం ఏమాత్రం వుందయ్యా?" అన్నాడు కృష్ణమూర్తి చెంచయ్యని గురుమూర్తిని ఉద్దేశించి.

వాళ్ళిద్దరూ వాళ్ళ పద్దుపుస్తకాలు తెరిచి "ఇదిగోనండి మేము కట్టినలెక్క మొత్తం ఇంత అయ్యింది" అంటూ కృష్ణమూర్తికి పద్దుపుస్తకాలందించారు.

"ఎంతయ్యిందదండి మొత్తం?" అనడిగాడు కొండయ్య.

"ఇదిగో చూడు" అంటూ కృష్ణమూర్తి అయిన ఖర్చు మొత్తాన్ని కొండయ్యకి చూపించాడు.

కొండయ్య కళ్ళు బైర్లుగమ్మాయి. అంత పెద్దమొత్తం ఖర్చవుతుందని అతని కలలోకూడ వూహించలేదు. నెమ్మదిగా కుదుటపడి - "నిరుడూ యింతమందీ వచ్చారు. నిరుడెంతయ్యింది?" అన్నాడు కొండయ్య ఉబికే కోపాన్ని అణుచుకుంటూ.

"నిరుడింతెక్కడయ్యింది! దీంట్లో సగవే" అన్నాడు చెంచయ్య.

"మరీయేడు రెట్టింపెక్కువెందు కయ్యింది?"

"ధరలన్నీ డబలయి పోయాయి. ఏం చేత్తాం సెప్పునాయనా?" అన్నాడు చెంచయ్య తాను నిమిత్తమాత్రుడనన్నట్టు.

"మీ కూలిలాగే ధరలూ పెరిగిపోయాయి. చెప్పానుగా నేను రోజులు మండిపోతున్నాయని" అన్నాడు కృష్ణమూర్తి పెద్ద జీవితానుభవం గల వ్యవహర్తలా.

"ఔను అర్థమైంది" అన్నాడు కొండయ్య కృష్ణమూర్తిని ఆపాద మస్తకం అసహ్యంగా ఒక్కసారి చూసి.

"ధరలు, రోజులేకాదు మండిపోతున్నది. అడవులు, కొండలు, గుండెలు కూడా మండిపోతున్నాయి. ఎప్పుడో ఒక్కసారే భగ్గుమంటాయ్ అన్నీ" అనుకున్నాడు కొండయ్య.

వాళ్ళకి రావలసిన మిగతాసొమ్ము తీసుకున్నాడు. ముఠా అంతా స్టేషనుదగ్గర కొచ్చేసింది. స్టేషనుదగ్గర చింతకింద కూర్చుని, వాళ్ళందరికి ఎవరెవరికి యెంతెంత

డబ్బురావాల్లో లెక్కలు చూసి పంచాడు కొండయ్య. ఏటా ఒక్కొక్కళ్ళకి వచ్చే కూలికంటె ఈయేడు తక్కువ వచ్చింది. అంటే మూడురూపాయల కూలప్పుడుకంటె నాలుగు రూపాయిల కూలప్పుడు వాళ్ళ చేతికొచ్చిన ఆదాయం తక్కువ వచ్చింది.

కొండయ్య చాలా బాధపడ్డాడు. వాళ్ళకి సమాధానం చెప్పటం చేతకాక తికమక పడ్డాడు.

అక్కడ వూళ్ళో - నారాయుడు యింట్లో ముగ్గురు పెద్దలూ కలుసుకుని, యిద్దరు షావుకారులకి కబురంపించారు.

చెంచయ్య, గురుమూర్తి వచ్చారు.

"ఆ తేడా యెంతయ్యా?" అన్నాడు కృష్ణమూర్తి.

"పదిహేనొందలండి" అన్నాడు గురుమూర్తి.

"తెచ్చారా?"

"తెచ్చామండి ఇదిగో" అంటూ పదిహేను వందల రూపాయలూ అందించాడు.

కృష్ణమూర్తి ఆ డబ్బునందుకుని, "యిదే మీరెక్కువిచ్చిన డబ్బు తీసుకోండి" అన్నాడు నారాయుడుతో.

నారాయుడు చిరునవ్వుతో అందుకున్నాడు.

"సదువుకున్నోడు సదువుకొన్నోడే. మనవూ వున్నాం?" అన్నాడు సూరన్న కృష్ణమూర్తి ప్రయోజకత్వాన్ని అభినందిస్తున్నట్టు.

రైలు కదిలింది. తూర్పుకి దూసుకుపోతోంది. ఇంజను గొట్టంలోంచి వెలువడిన పొగ తూర్పునుంచి పడమరకి వేగంగా వ్యాపిస్తోంది.

"ఎన్ని చదువులు చదివినా, ఈ వ్యత్యాసం, ఈ దోపిడీ సజావుగా సాగిపోవల్సిందేనేమో. రమణయ్య మేష్టారు మాత్రం ఆట్టేకాలం సాగదంటారు. ఔను సాగదు. సాగనివ్వకూడదు" అనుకున్నాడు కొండయ్య చివరిమాటగా, చివరి వూహాగా, చివరి నిర్ణయంగా.

★★★